# నీలివెన్నెల

## సి. సుజాత

"లాభం లేదు వాడి సంగతి చూస్తాను"

దుప్పటి ముసుగులోంచి ఒక కదలిక. ఒక చిన్న మాట. ఎదురుగా నిలబడిన వ్యక్తి మరింత ఆసక్తిగా చూశాడు ఆ కదలిక వంక; అర్థం కాకుండా వినిపిస్తున్న ఆ మాట కేసి. అతన్ని అదిమి పెట్టింది ఆమె.

"వద్దు. అంతకంటె ముఖ్యమైన అవసరం నీ ఎదరగా వుంది. దాని సంగతి చూడు" అంది ముసుగులోని వ్యక్తికే వినిపించేట్టు.

ఇప్పుడు దుప్పటి ముసుగు తొలగిపోయింది. ఇది గమనిస్తూ ఆ వ్యక్తి క్రీనీడలో నుంచి మరో అడుగు వేశాడు. దగ్గరగా, మరింత దగ్గరగా ఆ ముసుగు కనబడేలా.

తొలగిన ముసుగులో నుంచి ఓ చిన్నారి పైకి లేచింది. రేగిపోయిన దుమ్ము కొట్టుకున్న తలకట్టు, ముక్కుకు నత్తు, మురికిగా వున్న చక్కని మొహం, గడ్డం మీద పచ్చ, ఆ లైటు కాంతిలో అందంగా మెరుస్తూ ఆ మొహానికి వన్నె తెచ్చింది. ఆ చిన్నదాని కళ్ళు చుట్టూ చూచేయి చురుకుగా. ఆ పిల్ల మొహంలో తను ఊహిస్తున్న 'దుప్పటి ముసుగులో ప్రణయం' తాలూకు గుర్తుల కోసం ఆబగా వెతుకు తున్నాడు క్రీనీడ వ్యక్తి.

పన్నెండు గంటలు దాటుతోంది సమయం. ప్రపంచం అంతా సుషుప్తిలో మునిగి సేద దీర్చుకొం టున్న వేళ- ఆ ప్లాట్ ఫాం అంతా శవాల్లా జనం. బయట కురుస్తున్న వాన హోరు. చుట్టూ చితచితలాడుతూ వాసన వస్తున్న బురద. ఎక్కడ చూసినా ఉమ్ములు, భరించలేని దుర్వాసన వెద జల్లుతున్న చేపల బుట్టలు... ఇవన్నీ పట్టించుకోకుండా అలసి సొలసి నిద్రపోతున్న, దిక్కులేని, చారెడు నీడంటూ లేని అన్నార్తులు, రోజంతా రోడ్లు త్రవ్వే కూలీలు; ముష్టివాళ్ళు, కుష్ఠు వాళ్ళు.

తనను కష్టాల నుంచి, బ్రతుకు బరువు నుంచి తప్పించిన నిద్రాదేవి చల్లని ఒడిలో.

"నీలా" అన్నాడు దుప్పటిలో యువకుడు.

లేచి కూర్చున్న యువతి ఉలిక్కి పడింది.

"పడుకో... పడుకో... ఊరికే లేవాకులే" అన్నది.

ఆ 'నీలి'కి కొంత దూరంలో నిద్రపోతోంది ఓ లంబాడీ యువతి. నిర్లక్ష్యంగా వదిలేసిన అద్దాల రైక నుంచి బయటికి కనబడుతుంది సగం రొమ్ము. పాపాయి తాగుతూ వదిలేసిందేమో. ఆ పాప తడిపేసిన కొంగు చల్లదనం కూడా ఆ అలసిన తల్లికి మెలకువ తెప్పించ లేదు. ఆ పాపాయి చిరిగిన గౌను లోంచి బయటపడ్డ తెల్లటి బొజ్జను మొల చుట్టూ బిగుతుగా వున్న నల్లని మొలతాడు, తాయెత్తులు చూసి నవ్వింది నీలి. పాపాయి ప్రతిగా నవ్వింది. కల్మషం ఎరుగని, కష్టాలరుచి తెలియని బ్రతుకు. కుంగదీయని స్వచ్ఛమైన నవ్వు. నీలికి కళ్ళనీళ్ళు వచ్చేయి.

"ఆ పాప బ్రతుకులో చివరిదాకా ఇంత అందమైన నవ్వు నవ్వగలిగే రోజు వుంటుందా? నిద్ర పోతున్న ఆ పాప తల్లి కదిలింది. పాప చేతిలో పట్టుకొన్న తల్లి రొమ్ము మరింత బాగా కనపడుతోందిప్పుడు.

ఆ 'క్రీనీడ' వ్యక్తి మరింత ముందుకు వచ్చి రొమ్ము వంక ఆకలిగా... ఆబగా చూస్తున్నాడు. ఆ వ్యక్తికి పాతికేళ్ళు వుండవచ్చు. ఖరీదైన బట్టలు, చేతిలో బ్రీఫ్ కేసు. నీట్‌గా దువ్విన జుత్తు, ఖరీదైన మనిషి.

'రాబోయే రైలు కోసం ఎదురు చూస్తున్న వాడికి అనుకోకుండా మంచి కాలక్షేపం దొరికినట్టుంది' అను కుంది నీలి. అసహ్యం నరనరంలో పాకింది. ముసుగులో వున్న యువకుడు ఇదంతా గమనిస్తూనే వున్నాడు.

'నీలా' అన్నాడు ఆత్రంగా.

నీల చిన్నగా నిట్టూర్చి అతని పక్కనే పడుకుంది.

"వాడిని చంపేస్తే" ఉద్రేకంగా అంటున్నాడు సూర్యం.

"ఎవర్ని సూర్యం... ఎందర్ని... ఎంత మందిని శిక్షిస్తే మార్పు వస్తుంది"

ఆమె గొంతులో దుఃఖం సుడులు తిరిగింది.

పగలంతా చాకిరీ చేసి అలసిపోయి నిద్రపోతున్న ఆమె నగ్న స్తనాన్ని చూస్తూ, కళ్ళకు పండుగ చేసు కొంటున్న ఆ చదువుకొనే కుర్రాడికి, ఆ పాప తల్లి తన తల్లిగా కనపడలేదు. పాతికేళ్ళ క్రితం తనూ అలాగే తన తల్లి రొమ్ముతో ఆటలాడి వుంటానని గుర్తు రాలేదా? పాప చిన్నగా కదిలినా నిద్దలోనే ఉలికిపడుతూ, దగ్గరికి లాక్కుంటున్న ఆ తల్లిని చూస్తుంటే ఆ అమ్మ దనంలోని కమ్మదనం కనబడడం లేదా!..."

నిట్టూర్చింది నీలి. పడుకునే చుట్టూ పరికిస్తున్న నీలి కళ్ళు క్షణంలో తీక్షణం అయ్యాయి. ప్రమాదం పసి కట్టిన ఆమె మరుక్షణంలో లేచి కూర్చుంది.

"ఒరే.. అమ్మా... ఒరే... నాయనా... నమ్మకుం టరే మీరు... ఈడు సవతిని తెచ్చినాడంట. అత్తయ్యో లెయ్... లెయ్... యాడుంటివే... ఈడి జిమ్మడ... మాయమ్మో... నేనేం జేతునే" నీలి శోకాలు మొదలు పెట్టింది. చుట్టూ వున్న వాళ్ళలో నలుగురయిదుగురు లంబాడీలు లేచారు.

"ఏమయిందే నీలమ్మ" అంటు చుట్టూ చేరారు. మరో ఇద్దరు ముసుగు మీద పడి కొట్టడం మొదలు పెట్టేరు. శోకాలు పెడుతున్న ఆడవాళ్ళు. నిద్ర పోతున్న వాళ్ళు లేచి చుట్టూ మూగుతున్నారు. అప్పుడే మెట్లు దిగి లోపలికి వస్తున్న పోలీసుల్లో ఒకడు పరుగెత్తి వచ్చాడు

'ఏమయింది' అంటూ.

లంబాడీలు అర్థం పర్థం కాని భాషల్లో గొల్లుమన్నారు. 'ఎందుకురోయ్ వాణ్ణి చితక్కొడుతున్నారు. లెండి, లెండి అంటూ పోలీసు వాళ్ళని చేతిలో వున్న లాఠీతో బెదిరించాడు. నీలి మొహం అంతా కందేలా వెక్కిళ్ళు పెడుతోంది.

ఎందుకే మీ నోర్లుసడ. ఆ ఏడుపు లెందుకు.. పోలీస్ మిగతావాళ్ళని వదిలేసి, నీలని సముదాయించేం దుకు వచ్చాడు.

"కొట్టద్దంటవేం దొర... ఆడిని సంపినా పాపం వుంది! నాకో సవతిని దెచ్చినాడు ఆడు. ఆడి నోట్లో దుమ్మునడ" అంటూ పంచాంగం విప్పింది. రాగాలు



అలక్ష్యం తల్లిదండ్రులది

శిక్ష మాత్రం పాపాయికి

వచ్చే వారం


ప్రత్యేక వ్యాసం



తిమ్ముతూ మొగుణ్ని, వాడి తరపు బంధువుల్ని వరస పెట్టి తిడుతోంది. ఆ అమ్మాయి చెవులకు బరువైన వెండి జూంకీలు, అద్దాలుకుట్టిన రైక పైన చెల్లాచెదురుగా పూసలు, వెండి నగలు, మోచేతుల దాకా దంతపు గాజులు, శృతి చేసిన పాటలా రాగాలు తీస్తూ ఏడుపులు పోలీసుకు మహా హుషారు ఇచ్చేయి. పాపం నవ్వు ముంచుకొచ్చింది.

"ఛీ... నోరు ముయ్... ఈడికి తోడు ఇంకో సవితా! దానికి నువ్వు శోకాలా! పదా... లంబాడీ కొడుకుని పోలీస్ స్టేషన్‌లో నాలుగు మర్దిస్తే వదుల్తుంది రోగం. అసలు రేపటి నుంచి ఇక్కడ పడుకోండి చెప్తా! దిక్కు లేని వెధవలు కదా దయతలిస్తే... 'రేయ్ పదరా' అన్నాడు మరల టకటకమని లాఠీ ఆడించి. ముసుగులో వున్న మౌర్యం అర్థంగాని భాషలో బేర్ మన్నాడు. అంతకంటే పెద్దగా చుట్టూ వున్న వాళ్ళు నవ్వారు. ఓ ముసల్ది శోకాలు పెడుతూ మౌర్యాన్ని వదలకుండా పట్టు కొంది. నీలి కోపంగా చూసి,

'అల్లో ఓషన్‌కి పట్టుకుపోయి నవ్వగొట్టు' అన్నది అక్కసుగా. విసురుగా తల తిప్పటంతో గజ్జెలు మంటూ



నగలు మోగాయి. ముక్కున వున్న పుడక మెరిసింది. పోలీస్ దృష్టి మరల్చలేకపోయాడు. "ఓసి., సీ... పోలీస్ స్టేషనంటే మజాకాగా వుందే నీకు" అన్నాడు ముద్దుగా పోలీస్. అతని ముద్దు మొకం చూసి నవ్వు ముంచు కొచ్చింది నీలికి. చుట్టూ వున్న లంబాడీలు పోలీసువాడి కాళ్ళ చుట్టూ మూగేరు.

"నీ కాళ్ళు మొక్కుతా! ఆడిదేసనకు! ఇద్దరూ ఇద్దరే! కొట్టుకు చస్తారు! మళ్ళా ఏకమవుతారు నాయనా! నువు కోపం చేయకు" ముసల్ది సాగిలబడి మొక్కింది.

"లంబాడీ గోల అని ఊరికే అన్నారా? ఈడికే దిక్కు దివాణం లేకుండా స్టేషన్లో పడి వున్నాడు. ఈడికో ముండా; ఛీ ఎదవా!"

ఆని పోలీస్ తిట్టుకుంటూ వెనక్కి తిరిగి నీలి వేపు ముసిముసిగా చూస్తూ కదిలేడు. మరోసారి ఆనందంగా నవ్వింది నీలి.

మైకులో ఎనౌన్స్‌మెంట్ వినిపడుతోంది.

"సర్పూర్ హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ ఐదు నిము షాల్లో స్టేషన్‌లోకి వస్తోంది..."

మెట్ల దిగువుగా నిలబడ్డ పోలీస్ ఆఫీసర్ అసహనంగా దిక్కులు చూస్తున్నాడు.

"వాట్ హేపెండ్"

"నో సర్! ఏదో లంబాడీల తగవు"

లంబాడీలను వదిలేసి ప్లాట్ ఫాం అంతా పరుగులు పెట్టేరు పోలీసులు. లంబాడీలు ఇంకా చుట్టూ మూగి మాట్లాడుకుంటూనే వున్నారు. దడదడమని ఎక్స్ ప్రెస్ వచ్చి ఆగింది. దుప్పటి లోంచి మౌర్యం నిట్టూర్చాడు.

అంతా సవ్యంగానే జరిగింది. ఈ రైలు తనని గమ్యం చేర్చితే ఇన్నాళ్ళ శ్రమ ఫలితం పూర్తవుతుంది. రేపటి ఉదయం తను అడవిలో అడుగు పెట్టగానే సమ్మెకు జెండా ఎగురుతుంది. తునికాకు సమ్మె విజయవంతం కావాలి. ఆ దిక్కులేని నిర్భాగ్య గిరిజనులకు కనీసం కడుపు నిండా తిండి అయినా రావాలి. బీడీ ఆకు కోత జరగదు... ప్రభుత్వం దిగి రాక తప్పదు.. తన చుట్టూ వున్న లంబాడీలను చూశాడు మౌర్యం. వాళ్ళ వెనగ్గా అతను. నిద్రపోతున్న తల్లిని వికృతంగా చూస్తూ... నీలి కళ్ళు తిప్పి చూసింది.

"అతని సంగతి నేను చూస్తా మౌర్యం. నువు బండెక్కాయి కామ్రేడ్... నీకు నా విప్లవాభివంద నాలు..."

కప్పుకొన్న దుప్పటితో సహా లేచి వెత్తి చుట్టూ కప్పుకొని మనుషుల మధ్య చోటు చేసుకొంటూ రైలు ఎక్కేడు మౌర్యం. అతని కళ్ళు వాత్సల్యంగా నీలిని చూశాయి. 'యూనివర్సిటీలో సీరియస్‌గా పుస్తకాల పురుగులా, లైబ్రరీలో చదువుతూ వుండే ఈ నీల కాంత ఈ నాడు ఎంత ఎదిగింది! ఆ నాజూకైన కన్నెపిల్ల ఈనాడు తెలివైన ఫుల్ టైమ్ వర్కర్. పీడిత జాతి కోసం ప్రాణాలు తృణప్రాయంగా వదిలేయగల ధీరురాలు.

రైలు కదిలింది.

నీలి నిట్టూర్పు వదిలింది.

ఒక పని పూర్తయింది.

మరో పని వుంది ఎదురుగా. ఇంకో ఆడదాన్ని అలగా చూడకుండా, నీడకీ, మరుగుకీ నోచుకోని దీనుల కార్యకలాపాలు ఆసక్తితో చూస్తూ తన నీచత్వాన్ని బయట పెట్టుకొనే పశువుకు ఓ చిన్న పాఠం చెప్పాలి.

నీలి లేచింది. మురికిగా వున్న ఆ లంబాడి దుస్తులు ఆ అమ్మాయి మసి పాత్రలో చుట్టిన మాణిక్యంలాగా వుంది. లేచి ముందుకు నడుస్తూ వెనక్కి తిరిగి ఓ సైగ చేసింది.

తన వేపే వస్తున్న ఆ అమ్మాయిని చూస్తున్నాడు అతడు. ఒక్క గంతు వేసి అతని చేయి పట్టి లాగింది నీలి. ఏం జరిగిందో అర్థం అయ్యే లోగానే అతన్ని చుట్టు ముట్టి తలా రెండు దెబ్బలూ వేశారు. నీలి గొంతు అతనికి దగ్గరగా స్పష్టంగా, నదునుగా విన పడింది.

ప్లాట్‌ఫాం మీద పడుకొని నిద్రపోతున్న వాళ్ళ నగ్న సౌందర్యం కాదు తమ్ముడూ చూడవలసింది, వాళ్ళ దరిద్రాన్ని. చాటుమాటుకు నోచుకోని వాళ్ళ శృంగారం కాదు చూసేది! శరీరంలో రేగే కోర్కెలు తీర్చుకొని, కాస్తంత చోటైనా లేని ఆ దౌర్భాగ్యాన్ని కళ్ళారా చూడు. తల్లి రొమ్ముతో ఆటలాడే పాపాయిని చూడు. ఈ దిక్కు మాలిన దేశంలో ఆ పాప ఆనందంగా హాయిగా బ్రతికే రోజు వస్తుందా లేదా అని చూడు. నీ కళ్ళల్లో తరగని కన్నీళ్ళు, గుండెల్లో కొండంత ప్రేమ వున్నాయి. కొంతయినా ఆ దరిద్రుల కోసం ఖర్చు చేయరాదా..."

ఆ గొంతు వింటూ, తన మీద పడే దెబ్బలకు ప్రతిఘటించకుండా అలా నిలబడే వున్నాడు ఆ కుర్రాడు. ఎక్కడ వాళ్ళక్కడ సర్దుకున్నారు. శబ్దం చేస్తూ రైలు వెళ్ళి పోయింది. ఆ కుర్రాడి కళ్ళల్లో తిరి గిన కన్నీళ్ళతో ప్లాట్ ఫాం అంతా మసగ్గా కనబడింది. ●